నాగోల్‌లో సైబర్ మోసం

లోన్ మాయలో లక్షా పాతిక వేల దోపిడి

విశ్వంభర, నాగోల్ : తక్కువ వడ్డీతో లోన్ ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పి ఒక ఉపాధ్యాయుడిని లక్షా పాతిక వేల రూపాయలతో మోసం చేసిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం... నాగోల్ సాయినగర్ కాలనీకి చెందిన కొప్పుల లింగా రెడ్డి (46) ఉపాధ్యాయుడు. ఈ నెల 2వ తేదీన ఉదయం అపరిచిత వ్యక్తులనుండి ఫోన్ కాల్ అందుకున్నారు. కాల్ చేసిన వ్యక్తి తాను ఐసిఐసిఐ బ్యాంక్ నానక్ రామ్ గూడ బ్రాంచ్ నుండి మాట్లాడుతున్నానని చెప్పి, తక్కువ వడ్డీతో పెద్ద మొత్తంలో లోన్ అందిస్తానని హామీ ఇచ్చాడు. ఇప్పటికే ఇతర బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయని, లోన్ అవసరం లేదని బాధితుడు చెప్పినప్పటికీ, ప్రస్తుత లోన్లను క్లోజ్ చేసి మరింత తక్కువ వడ్డీతో కొత్త లోన్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. తనను "ప్రదీప్"గా పరిచయం చేసుకున్న ఆ మోసగాడు, బాధితుడి సిబిల్ స్కోర్ తక్కువగా ఉందని పేర్కొంటూ, ప్రాసెసింగ్ ఛార్జీలు, డాక్యుమెంట్ ఫీజుల పేరుతో రూ.1,25,000 చెల్లించాలని కోరాడు. నమ్మకంగా మాట్లాడటం, బ్యాంక్ ఉద్యోగి లాగా ప్రవర్తించడం వల్ల బాధితుడు అతని మాటలను నమ్మి, తన వ్యక్తిగత వివరాలను వాట్సాప్ ద్వారా పంపించాడు. ఆ తర్వాత మోసగాడి సూచనల మేరకు మూడు విడతలుగా డబ్బులు బదిలీ చేశాడు. ఏప్రిల్ 7న తన భార్య ఖాతా నుండి రూ.50,000, ఏప్రిల్ 14న మరో రూ.50,000, ఏప్రిల్ 28న తన ఖాతా నుండి రూ.25,000 ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేశారు. మొత్తం డబ్బు అందుకున్న తర్వాత మోసగాడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, వాట్సాప్ నంబర్ కూడా అందుబాటులో లేకుండా పోయింది. దీంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయించుకున్నారు. అనంతరం నాగోల్ పోలీస్ స్టేషన్‌లో అధికారిక ఫిర్యాదు ఇవ్వగా, పోలీసులు కేస్ నమోదు చేశారు. ఇన్స్పెక్టర్ మొహమ్మద్ మక్బూల్ జాని మాట్లాడుతూ, నిందితుడిని గుర్తించేందుకు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. డబ్బులు వెళ్లిన ఖాతాల వివరాలు సేకరించి, సంబంధిత బ్యాంకులతో సమన్వయం జరుపుతున్నట్లు తెలిపారు.

పదవ తరగతిలో ప్రభంజనం సృష్టించిన హయత్ నగర్ కల్సా నారాయణ సి ఓ ఉన్నత పాఠశాల

విశ్వంభర, హయత్ నగర్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఈ సంవత్సరం పరీక్షల్లో అత్యధిక మార్కులతో విద్యార్థులు పోటీస్థాయిని మరింత పెంచారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాల నుండి 182 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 100% ఉత్తీర్ణతతో పాటు మేధాన్ శ్రీరామ్ 597 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. వరుసగా 596 మార్కులతో కిలారి లలిత్. 595 మార్కులతో డి సాయి మనితేజ. 594 మార్కులతో వరుణ్ తేజ్ రాష్ట్రస్థాయిలో రెండవ.మూడవ. నాలుగవ స్థానంలో నిలిచారు. ఈ విద్యా సంవత్సరం రాష్ట్రస్థాయిలో వరుసగా నాలుగు స్థానములు సాధించి పాఠశాల చరిత్రలోనే సువర్ణాక్షరాలతో ఫలితాలను లిఖించినారు. ఈ విద్యా సంవత్సరం 182 మంది విద్యార్థులలో 590 కి పైగా మార్కులు 11 మంది విద్యార్థులు సాధించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయం పై నారాయణ గ్రూప్ డైరెక్టర్ రమానారాయణ, జిఎం గోపాల్ రెడ్డి , పాఠశాల డీన్ మదనాచారి, ఏ జి ఎం సదాశివుడు ' పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ విద్యార్థులను అభినందించారు. ఈ ఫలితాలకు కారణమైన ఉపాధ్యాయ బృందాన్ని. తల్లిదండ్రులను ప్రతి ఒక్కరిని పేరు పేరునా అభినందించినారు. ఈ ఫలితాలు భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలకు విద్యార్థులను ప్రేరేపిస్తాయని పేర్కొన్నారు.

అమీర్‌పేట్‌లో చలివేంద్రం ప్రారంభించిన దిశా లా ఫర్మ్

విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణలో ప్రముఖ న్యాయ సేవల సంస్థగా గుర్తింపు పొందిన దిశా లా ఫర్మ్ అధినేత డా. నాగేశ్వరరావు పూజారి, సామాజిక బాధ్యతపై తన కట్టుబాటును మరోసారి చాటుతూ అమీర్‌పేట్‌లో చలివేంద్ర సేవా కార్యక్రమాన్ని ప్రారంభించింది. అమీర్‌పేట్‌లోని కేఎల్‌ఎం షాపింగ్ మాల్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి న్యాయవేత్తలు, స్థానిక నాయకులు, సమాజ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేయడం ప్రతీ సంస్థ బాధ్యత అన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజూ సుమారు 1000 మందికి తాగునీరు, శీతల పానీయాలు అందించేలా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దిశా లా ఫర్మ్ న్యాయ సేవలతో పాటు సామాజిక సేవలో కూడా ముందుండి పనిచేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు సంకల్పబద్ధంగా కొనసాగుతుందన్నారు. అడ్వకేట్ నాగేశ్వర రావు పూజారితో పాటు స్థానిక నాయకులు, సంఘాల పెద్దలు మరియు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండాలి

చిలుక మధుర ఉపేందర్ రెడ్డి

విశ్వంభర, ఎల్బీనగర్ : కిషోర్ బాలికలు ఆరోగ్యంగా ఉండాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఎన్టీఆర్ నగర్ డివిజన్ పరిధిలోని 50 యార్డ్స్ వీధిలో గల అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోర బాలికల అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుర ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే తల్లిదండ్రులకు, అంగన్వాడీ కార్యకర్తలకు తెలియజేయాలని సూచించారు. భద్రత గురించి అవగాహన కల్పించారు. కిశోర బాలికలు మానసికంగా, శరీరకంగా ఎదిగితేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చాన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు శశికళ, సిబ్బంది, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, పెద్దపూర సైదులు, గుణగంటి రమేష్ గౌడ్, మునిస్వామి, రాజు, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

సేవాదళ్ నాయకులు దేశసేవ కోసం నిలబడి పోరాడుతారు

- కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయి నుండి బూత్ స్థాయి వరకు తీసుకెళ్లడంలో వీరి పాత్ర కీలకం
- కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలంటే సేవాదళ్‌ను బలోపేతం చేయడం తప్పనిసరి
- మహిళా, శిశు సంక్షేమ శాఖల కేబినెట్ మంత్రి సీతక్క

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, 35 జిల్లా అక్షులు , మండల అధ్యక్షులు 119 నియోజకవర్గాల అధ్యక్షులు కోసం నిర్వహిస్తున్న "సమర్థ్" శిక్షణా శిబిరాన్ని బుధవారం తెలంగాణ ప్రభుత్వ పంచాయతీ రాజ్ & గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల కేబినెట్ మంత్రి సీతక్క సందర్శించి, సేవాదళ్ నాయకులు , కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయి నుండి బూత్ స్థాయి వరకు తీసుకెళ్లడంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ పాత్ర అత్యంత కీలకమని అన్నారు. సేవాదళ్‌ను మండల స్థాయి నుండి ప్రతి పోలింగ్ బూత్ స్థాయి వరకు బలోపేతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.రాజకీయాల్లో పెద్ద నాయకులు కాలానుగుణంగా పార్టీలు మారవచ్చు, పదవులు మారవచ్చు, పరిస్థితులు మారవచ్చు; కానీ సిద్ధాంతపరమైన శిక్షణ పొందిన సేవాదళ్ నాయకులు మాత్రం కాంగ్రెస్ పార్టీ ఆలోచనల కోసం, ప్రజాస్వామ్య విలువల కోసం, దేశసేవ కోసం నిలబడి పోరాడుతారని మంత్రి సీతక్క గారు అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి సిద్ధాంతపరంగా బలమైన, క్రమశిక్షణ కలిగిన సేవాదళ్ నాయకత్వం అవసరమని ఆమె పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలంటే సేవాదళ్‌ను బలోపేతం చేయడం తప్పనిసరి అని మంత్రి గారు స్పష్టం చేశారు. దేశానికి సేవ చేయాలనే భావనతో, ప్రజల కోసం పనిచేయాలనే నిబద్ధతతో రాజకీయాల్లోకి రావాలనుకునే ప్రతి ఒక్కరూ ముందుగా సేవాదళ్‌లో చేరి శిక్షణ పొందాలని ఆమె సూచించారు. దేశసేవ, ప్రజాసేవ, క్రమశిక్షణ, త్యాగం, నిబద్ధత అనే విలువలు నేర్చుకున్న తర్వాతే రాజకీయాల్లోకి రావడం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి అవసరమని ఆమె అన్నారు.ముఖ్యంగా తెలంగాణ యువత సేవాదళ్‌లో పెద్ద సంఖ్యలో చేరాలని మంత్రి సీతక్క గారు పిలుపునిచ్చారు. యువతలో శక్తి ఉంది, ఆలోచన ఉంది, పోరాట స్ఫూర్తి ఉంది; ఆ శక్తికి సేవాదళ్ శిక్షణ, కాంగ్రెస్ సిద్ధాంతం, సామాజిక బాధ్యత కలిస్తే తెలంగాణలో బలమైన ప్రజాసేవా శక్తి తయారవుతుందని ఆమె అన్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి ఒక ముఖ్యమైన సూచన చేశారు. కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ బాధ్యతలు చేపట్టాలనుకునే వారందరికీ సేవాదళ్ శిక్షణను తప్పనిసరి చేసే విధంగా పీసీసీ ఆలోచించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సేవాదళ్ శిక్షణ పూర్తిచేసిన నాయకులను పార్టీలో బాధ్యతలకు తీసుకుంటే, వారు కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి, పార్టీ క్రమశిక్షణతో, ప్రజాసేవా దృక్పథంతో పనిచేస్తారని ఆమె అభిప్రాయపడ్డారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ, సేవాదళ్ శిక్షణా శిబిరాలు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలకే పరిమితం కాకుండా ప్రతి బూత్ స్థాయిలోనూ నిరంతరంగా నిర్వహించాలి అని సూచించారు. బూత్ స్థాయిలో క్రమం తప్పకుండా శిక్షణా కార్యక్రమాలు జరిగితే గ్రామ ప్రజల హక్కులపై అవగాహన పెరుగుతుందని, స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా తీసుకెళ్లే సామర్థ్యం సేవాదళ్ కార్యకర్తల్లో పెరుగుతుందని ఆమె అన్నారు.గ్రామ పౌరుల హక్కులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన, స్థానిక సమస్యల పరిష్కారం, మహిళల భద్రత, యువత అవకాశాలు, రైతుల సమస్యలు, బలహీన వర్గాల హక్కులు వంటి అంశాలపై సేవాదళ్ కార్యకర్తలు ప్రజలకు దగ్గరగా పని చేయాలని మంత్రి గారు సూచించారు. బూత్ స్థాయి శిక్షణా శిబిరాలు గ్రామ ప్రజల హక్కులకు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆమె అన్నారు. అలాగే గ్రామ స్థాయిలో సోషల్ మీడియాలో వ్యాపించే తప్పుడు వార్తలు, అసత్య ప్రచారం, అపోహలు, ప్రజలను తప్పుదారి పట్టించే సమాచారంపై సేవాదళ్ కార్యకర్తలు గట్టిగా గొంతెత్తాలని మంత్రి సీతక్క గారు పిలుపునిచ్చారు. నిజమైన సమాచారం, ప్రజల వాస్తవ సమస్యలు, గ్రామ స్థాయి ప్రజాభిప్రాయం పైస్థాయి ప్రభుత్వానికి మరియు పార్టీ నాయకత్వానికి చేరేలా సేవాదళ్ కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని ఆమె సూచించారు. దీని ద్వారా ప్రభుత్వం మరియు రాజకీయ పార్టీలు సరైన నిర్ణయాలు తీసుకునే దిశగా మార్గనిర్దేశం చేయడంలో సేవాదళ్ కీలక పాత్ర పోషించగలదని ఆమె అన్నారు. సేవాదళ్ శిక్షణ పొందిన నాయకులు కేవలం ఎన్నికల సమయంలో పనిచేసే కార్యకర్తలు కాకుండా, సంవత్సరం పొడవునా ప్రజల మధ్య ఉండే ప్రజాసేవకులుగా తయారవుతారని మంత్రి గారు అన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు, మహిళల సమస్యలు, యువత సమస్యలు, రైతుల కష్టాలు, పేదల అవసరాలు తెలుసుకుని, వాటిని కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలతో అనుసంధానం చేయడంలో సేవాదళ్ కార్యకర్తలు ముందుండాలని ఆమె సూచించారు."సమర్థ్" శిక్షణా శిబిరం వంటి కార్యక్రమాలు సేవాదళ్ నాయకుల్లో సిద్ధాంత స్పష్టత, ప్రజా కమ్యూనికేషన్ నైపుణ్యం, సంస్థాగత క్రమశిక్షణ, బూత్ స్థాయి బాధ్యత, నాయకత్వ లక్షణాలు మరియు సామాజిక స్పృహను పెంపొందిస్తాయని మంత్రి సీతక్క అన్నారు. ఇలాంటి శిక్షణా శిబిరాలు ప్రతి జిల్లాలో, ప్రతి మండలంలో, చివరకు ప్రతి బూత్ స్థాయిలో విస్తరించాలని ఆమె ఆకాంక్షించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ మాట్లాడుతూ, "సమర్థ్" శిక్షణా శిబిరం ద్వారా రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ మరియు మండల కమిటీ సభ్యులను సిద్ధాంతపరంగా, సంస్థాగతంగా, ప్రజాసేవా దృక్పథంతో బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు.సేవాదళ్ చరిత్ర, కాంగ్రెస్ సిద్ధాంతం, జెండా వందనం, బూత్ స్థాయి సంస్థాగత బలోపేతం, ప్రజా ఉద్యమాల నిర్వహణ, సోషల్ మీడియా అవగాహన, రాజ్యాంగ విలువలు, శారీరక క్రమశిక్షణ వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నామని ఆయన చెప్పారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేయడంలో, ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానం పెంచడంలో, యువతలో సేవా భావన పెంపొందించడంలో, రాజ్యాంగ విలువలను కాపాడడంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ కీలక పాత్ర పోషిస్తుందని శ్రీ మిద్దెల జితేందర్ అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కమిటీ కొదుమూరి దయాకర్ రావు సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, సేవాదళ్ వాలంటీర్లు,కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసు సారథికి ఆత్మీయ వీడ్కోలు!

విశ్వంభర, హైదరాబాద్ : డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం వేదికగా నిర్వహించిన వీడ్కోలు వేడుక అత్యంత ఘనంగా, ఆత్మీయతతో కూడిన వాతావరణంలో సాగింది. సుదీర్ఘ కాలం పాటు పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి, తనదైన ముద్ర వేసిన డిజిపి బి. శివధర్ రెడ్డి నిష్క్రమణ సమయంలో సహచర అధికారులు, సిబ్బంది భావోద్వేగానికి లోనయ్యారు.కార్యక్రమ ఆరంభంలో, శివధర్ రెడ్డి తన బాధ్యతలను శాంతిభద్రతల డిజిపి మహేష్.ఎం. భగవత్‌కు అప్పగించారు. నూతన డిజిపి గా సి.వి. ఆనంద్ బాధ్యతలు స్వీకరించే వరకు, ఇన్చార్జ్ డీజీపీగా మహేష్ భగవత్ వ్యవహరించనున్నారు. అధికారిక బదిలీ ప్రక్రియ అనంతరం, వీడ్కోలు పలికేందుకు తరలివచ్చిన ఐపిఎస్ అధికారులు, సిబ్బంది కి చేతులు ఊపుతూ అభివాదం చేస్తూ తనను కలిసేందుకు వచ్చిన కరచాలనం చేస్తూ, ఆత్మీయంగా పలకరిస్తూ శివధర్ రెడ్డి ముందుకు సాగారు.అనంతరం పూలతో అలంకరించిన వాహనంపై నిలబడి, అందరికీ చేతులు ఊపుతూ అభివాదం చేశారు. పోలీసు సంప్రదాయంలో అత్యంత గౌరవప్రదమైన రీతిలో ఐపిఎస్ అధికారులు తాళ్లతో ఆ వాహనాన్ని తాగుతుండగా, ఇతర సిబ్బంది డిజిపి పై పూలు చల్లుతూ కార్యాలయ ప్రధాన ద్వారం వరకు సాగనంపారు. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ తమ ప్రియ తమ అధికారికి వీడ్కోలు పలుకుతుంటే, ఆ ప్రాంగణం మొత్తం భావోద్వేగంతో నిండిపోయింది. టిజిసిఎస్బి డైరెక్టర్ శిఖా గోయల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, శాంతి భద్రతల డీజీపీ మహేష్ ఎం. భగవత్, టిఎస్ఎల్పిఆర్బి చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు, ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లక్రా, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ విజయకుమార్ లతో పాటు పలువురు ఐపిఎస్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు సాదర వీడ్కోలు పలికారు. చివరగా, ప్రధాన గేటు వద్దకు చేరుకున్న శివధర్ రెడ్డి అందరి కృతజ్ఞతలను స్వీకరిస్తూ తన వాహనంలో వెళ్లారు.

జనగణనలో బీసీల భవిష్యత్తు దాగుంది

సెల్ఫ్ ఎన్యూమరేషన్ కీలకం... ఖచ్చితమైన డేటా లేకుంటే నష్టం

గ్రామాల్లో అవగాహన లోపం... సహాయక కేంద్రాల అవసరం

విశ్వంభర, హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రారంభమైన జనగణన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియపై బీసీ వర్గాల్లో చర్చలు ముమ్మరమవుతున్నాయి. డిజిటల్ విధానంలో సాగుతున్న ఈ ప్రక్రియ భవిష్యత్ సంక్షేమ విధానాలపై నేరుగా ప్రభావం చూపనున్న నేపథ్యంలో సామాజిక వర్గాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బీసీల వాస్తవ పరిస్థితులు గణాంకాల్లో ప్రతిబింబిస్తాయా లేదా అన్నది కీలకంగా మారింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఓబీసీ సెల్ నేషనల్ ఇన్‌చార్జ్ కత్తి వెంకటస్వామి, వీజీఆర్ నారగోని పాల్గొన్నారు. గుజ్జ సత్యం మాట్లాడుతూ, "బీసీల వాస్తవ పరిస్థితులు ప్రభుత్వానికి తెలియాలంటే ఖచ్చితమైన డేటా తప్పనిసరి. గతంలో సరైన గణాంకాలు లేకపోవడం వల్ల అనేక వర్గాలు నష్టపోయాయి," అని పేర్కొన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్‌లో ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు. కుల గణనలో చిన్న తప్పిదం కూడా రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల అమలుపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్‌ను ప్రజలు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. "ఇది కేవలం ఆన్‌లైన్ నమోదు కాదు... భవిష్యత్ విధానాల బేస్," అని పేర్కొన్నారు. బీసీల సామాజిక, ఆర్థిక స్థితి సరిగ్గా ప్రతిబింబించాలంటే ప్రజలే ముందుకు వచ్చి ఖచ్చితమైన సమాచారం నమోదు చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అవగాహన, ఇంటర్నెట్ సౌకర్యాల లోపం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. జనగణనలో భాగంగా ప్రజలు మే 11లోగా https://se.census.gov.in ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని, అనంతరం ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ధృవీకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా ఓబీసీ ఇన్‌చార్జ్ సూర్యనారాయణ, అఖిలభారత యాదవ సంఘం అధ్యక్షులు రాములు యాదవ్, సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా.రాజ్నారాయణ ముదిరాజ్ , మట్ట జయంతి గౌడ్, పుష్పలీల గౌడ్, శివ యాదవ్, మహేష్ యాదవ్, జిల్లా నరేందర్, జయరాజ్ పాల్గొన్నారు.

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు తల్లోజు ఆచారి కుమారుడు భరత్ వివాహము నవ్యతో మన్నెగూడ లోని బిఎంఆర్ సార్థ కన్వెన్షన్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సామాజికవేత్త వితత్రి న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రిక సీఎం డి డాక్టర్ కాచం సత్యనారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వీత్రి న్యూస్ ఛానల్ స్టేట్ కరెస్పాండెంట్ ఏల మహేష్ నేత, కందే రామ్ నరేష్ పాల్గొన్నారు.

- విశ్వంభర, తుర్క యంజాల్

కాలనీ లో సమస్యలు పరిష్కరించాలంటూ జోనల్ కమిషనర్ కు వినతి

విశ్వంభర, ఎల్బీనగర్ : సరూర్నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో కు సరూర్నగర్ డివిజన్ కాలనీ సంక్షేమ సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్ నేతృత్వంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భైరబాల కిషన్ మాట్లాడుతూ చెరుకు తోట కాలనీ రోడ్ నెంబర్ 3 కేపీఎల్ ఫ్రెష్ నుండి చెరుకు తోట కాలనీ టర్నింగ్ పాయింట్ వరకు 275 మీటర్లు పూర్తిగా అధ్వాన స్థితిలో ఉన్న బీటీ , సిసి రోడ్డు వెంటనే ఆధునికరించాలని కోరారు. రోడ్డు గుంతల మయం కావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. అంబేద్కర్ నగర్ లో ఉన్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన స్మశాన వాటిక కు ప్రహరీ గోడ నిర్మించాలని, చెరుకు తోట కాలనీ కమ్యూనిటీ హాల్లో ఓపెన్ జిమ్ సగంలోనే ఆగిపోయిందని.. కమ్యూనిటీ హాల్ పక్కనే ఒక 60 మీటర్ల వరకు ఉన్న సిసి రోడ్ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. నూతనంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ గా నియమితులైన వికాస్ మహతో సరూర్నగర్ డివిజన్ కాలనీ సంక్షేమ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పట్టు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చెరుకు తోట కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తాండ్ర భాస్కర్, పద్మాకర్, చింతకింది రంజిత్, లకుముల కరుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి: సిఐటియు

విశ్వంభర, వనస్థలిపురం : కార్మిక హక్కులను హరిస్తున్న నాలుగు లేబర్ కోడ్ ల రద్దుకై , మేడే, స్ఫూర్తితో పోరాడుదాం అని రంగారెడ్డి జిల్లా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అన్నారు. మే డే కరపత్రమును విడుదల చేశారు. మే 1 నుండి 7 వరకు జరిగే వారోత్సవాలను జయప్రదం చేయాలని, వనస్థలిపురం రైతు బజార్ చౌరస్తాలో కరపత్రం విడుదల చేశారు. ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన 140 వ మేడేను పోరాట దీక్ష దినంగా పాటించండి అన్నారు. కేంద్రంలో మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, కార్మిక వ్యతిరేక విధానాలను నీ సిగ్గుగా అమలు అమలు చేస్తున్నది అని అన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం వందల సంవత్సరాల క్రితం నుండి బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకునే అనేక చట్టాలను కలిపి వేసి నాలుగు లేబర్ కోర్టులను తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భారతమ్మ, వరలక్ష్మి, జయమ్మ, లక్ష్మమ్మ ,ఋషి ,ధనరాజు, కాశమ్మ, మహేష్, గాయత్రి, కృష్ణమూర్తి, ఎండి కొధ్వద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ఘన సన్మానం

విశ్వంభర, సరూర్ నగర్ : శ్రీ త్రివేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యా సంవత్సరానికి చెందిన రెండు బ్రాంచ్‌ల (సరూర్‌నగర్ , చంపాపేట్) ప్రతిభావంతుల సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అద్భుత విజయాలను అభినందించి, ఉపాధ్యాయుల అంకితభావాన్ని తల్లిదండ్రుల సహకారాన్ని ప్రశంసించారు. క్రమశిక్షణ, పట్టుదల నిరంతర శ్రమే విజయానికి మూలమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారిలో పి. యేశ్వంత్ (584), వి. ఐనికా (583), ఎన్. కీర్తనా (583), జి. తన్మయి (582), వి. కేశ శ్రీ (580), శ్రీనికేష్ ధనేకర్ (580), మొహమ్మద్ నసీరుద్దీన్ (578), కె.వి. కావ్య సుధ, రాషి మహేంద్రకర్ (577), జె. సుదీక్ష (576), ఎ. హిమశ్రీ (574), వి. ప్రతిక (573), అనుజ్ తివారి (571), ఎం. ప్రణీత్ (570) ఉన్నారు. ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ సునీల్ కుమార్ , ప్రిన్సిపాళ్లు ఎం. శారద , యోగేశ్వరి , టీచర్ కౌన్సెల్ అంజుం ఫిర్దౌస్ , విద్యార్థులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.